క్లుప్తంగా

అక్రమంగా మట్టి తరలింపు



మునగపాకలో ట్రాక్టర్లపై మట్టి తరలిస్తున్న దృశ్యం

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మునగపాక కృష్ణంరాజు కాలువపై నూతనంగా బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా తవ్వేసిన మట్టిని ఆదివారం కొంతమంది అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా తరలించుకుపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టపగలే యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ తరలింపు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

వైభవంగా బోనాల సమర్పణ



అమ్మవారికి బోనాలను సమర్పిస్తున్న భక్తులు

కోటవురట్ల: తలుపులమ్మతల్లికి పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి తంగేడు కాటా వద్ద ఆలయం వరకు గ్రామస్తులు బోనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, డప్పు వాయిద్యాలతో బోనాలను వైభవంగా ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. పాడి పంటలతో అంతా సుభిక్షంగా ఉండేలా దీవించాలని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కోలాహలం నెలకొంది. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు పర్యవేక్షణ చేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం రేపు

కోటవురట్ల: స్థానిక సమావేశ మందిరంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందని, ఇందులో దృష్టి పరీక్ష, కళ్లద్దాల పవర్ తనిఖీ, కేటరాక్టు, రెటీనా, కార్నియా, గ్లుకోమా, ఆర్బిట్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

మునగపాక తహసీల్దార్‌గా సత్యనారాయణ



మునగపాక: మండల తహసీల్దార్‌గా పి.సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్.ఆదిమహేశ్వరరావును పాయకరావుపేటకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌ను ఇక్కడ బదిలీ చేసినా ఆయన విధుల్లో చేరలేదు. దాంతో బుచ్చెయ్యపేట మండల రీ-సర్వే డీటీ సత్యనారాయణను మునగపాక తహసీల్దార్‌గా నియమించడంతో తాజాగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఫిజియోథెరపీలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పెనుమత్స శిరీషరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీటీలో 55 శాతం మార్కులు, అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15 మధ్యాహ్నం 3 గంటల్లోపు కళాశాలలో సంప్రదించాల్సిందిగా కోరారు.


మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు గ్రామానికి చెందిన పడాల కొండలరావు, లక్ష్మీకుమారి దంపతుల ఆర్థిక సహకారంతో ప్రసాద వితరణ చేశారు.

చేపా చేపా ఎందుకు ఎండ లేదు?





తీర ప్రాంతంలో ఇసుక తిన్నెలపై ఎండపెట్టిన చేపలు

- ప్లాట్ ఫారాలు లేక ఇబ్బందులు
- ఇసుక పాలవుతున్న మత్స్య సంపద
- నష్టపోతున్న మత్స్యకారులు
- ఇంజిన్లు, వలలకు భద్రత కరువు



ఇసుక దిబ్బల్లోనే వలలు రిపేరు చేసుకుంటున్న మత్స్యకారులు



స్టోర్ రూం లేక ఒడ్డున తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పాకలో ఉంచిన ఇంజన్లు, వలలు

నక్కపల్లి: చేపా చేపా ఎందుకు ఎండ లేదంటే.. ప్లాట్‌ఫారాలు లేవు. అందుకే ఎండలేదంటోంది. దశాబ్దాలుగా మత్స్యకారుల గోడును ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో సముద్రంలో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రాణాలకు తెగించి తెచ్చుకున్న మత్స్య సంపదను ఎండబెట్టుకునేందుకు అవస్థలు పడుతున్నారు. దీంతోపాటు వలలు, ఇంజిన్లు భద్రపరచుకునేందుకు స్టోర్‌రూంలు లేక తుపాన్లు, భారీ వర్షాలు వచ్చినప్పుడు నష్టం వాటిల్లుతోందని, అలల ధాటికి కొట్టుకుపోతున్నాయంటూ వారు వాపోతున్నారు. నియోజకవర్గంలో 19 మత్స్యకార గ్రామాలున్నాయి. 35 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. 1,400 లైసెన్స్ కలిగిన తెప్పలున్నాయి. వీటిపై వేట సాగించేవారు దాదాపు 8 వేల మంది ఉంటారు. 7 గ్రామాల్లో మాత్రమే స్టోర్ రూములు, ప్లాట్ ఫారాలున్నాయి. అమలాపురం, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, రాజయ్యపేట, బంగారయ్యపేట, పెంటకోట, రాజవరం, వెంకటనగరం, బోయపాడు, రాజానగరం, రేవుపోలవరం, బంగారమ్మపాలెం తదితర గ్రామాల్లో మత్స్యకారులకు తగ్గట్టుగా తీర ప్రాంతంలో మౌలిక సదుపాయాలు లేవు. రేవులోకి వెళ్లేందుకు సరైన రోడ్డు సదుపాయాలు లేవు. ఈ ప్రాంతంలో ఎండుచేపలకు బాగా గిరాకీ ఉంది. సముద్రంలో వేటాడి తెచ్చిన చేపలను ఇసుక తిన్నెల్లో ఎండబెట్టి పూరి, పారాదీప్, నాగార్జున సాగర్, కలకత్తా, శ్రీశైలం, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.

ప్లాట్ ఫారాలు లేక ఇబ్బందులు

ఈ చేపలను ఎండబెట్టుకునేందుకు ఒక్కో గ్రామంలో 50కు మించి తెప్పలు, బోట్లు కలిగి ఉంటే అక్కడ కనిష్ఠంగా రెండు ప్లాట్ ఫారంలు నిర్మించాలి. కొన్ని గ్రామాల్లో ఒక ప్లాట్ ఫారం కూడా లేదు. పాయకరావుపేట మండలంలో పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, వెంకటనగరం, నక్కపల్లి మండలం రాజయ్యపేట తదితర పెద్ద గ్రామాల్లో ఒక్కొక్కటే ప్లాట్ ఫాం ఉంది. రాజయ్యపేటలో మూడు ఉండాలి. పెదతీనార్ల, చినతీనార్ల, రాజవరం, కేశవరం గ్రామాల్లో లేవు. ఎస్.రాయవరం మండలంలో రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాల్లో నాలుగు నుంచి ఐదు ప్లాట్ ఫారంలు నిర్మించాలి. ఎక్కడా ఒకటికి మించి లేవు. గ్రామాల నుంచి సముద్రపు ఒడ్డుకు పక్కా రోడ్డు లేక ఆటోలో సంపదను తరలించడానికి రవాణా చార్జీలు తడిసి మోపెడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రాజయ్యపేట, రేవుపోలవరం, బంగారమ్మపాలెం, వెంకటనగరం గ్రామాల్లో స్టోర్ రూంలు నిర్మించారు. చాలా చోట్ల, స్టోర్ రూంలు, ప్లాట్ ఫారాలు లేక తీరంలో టార్పాలిన్లు వేసి చేపలను ఎండబెడుతున్నారు. ఇక చిన్నపాకలు ఏర్పాటు చేసి వాటిలోనే వలలు, ఇంజన్లు భద్రపరుస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారుల కోసం ప్లాట్ ఫారాలు, స్టోర్ రూములు నిర్మించాలని కోరుతున్నారు.

ఇసుక తిన్నెలపైనే చేపలు ఎండబెట్టుట

చేపలను ఎండబెట్టుకునేందుకు తీరం వెంబడి ఉన్న ఇసుక తిన్నెలే వీరికి గతవుతున్నాయి. ఇసుక తిన్నెల్లో చేపలను ఎండబెట్టడం వల్ల గిట్టుబాటు ధర రావడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. ప్లాట్ ఫారాలపై ఎండిన చేపలకు ఇసుక తిన్నెలపై ఎండిన వాటికి ధరలో వ్యత్యాసం ఉంటోందని చెబుతున్నారు. మత్స్య సంపదను భద్రపరచుకోవడం, ఎండబెట్టుకునేందుకు, వేలాది రూపాయలు విలువచేసే వలలు దాచుకోవడం, మరమ్మతుల కోసం ప్లాట్ ఫారాలు, స్టోర్ రూంలు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా చేస్తున్న డిమాండ్ సముద్ర రోదనే అవుతోంది. వేటాడి తెచ్చిన సంపద ఎండ బెట్టుకునే సమయంలో అకస్మాత్తుగా తుపానులు, భారీ వర్షాలు వస్తే సంపద అంతా నాశనమవుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు లేవు



మత్స్యకార గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేవు. ఎన్నో ఏళ్ల నుంచి ప్లాట్ ఫారాలు, స్టోర్ రూములు నిర్మించాలని కోరుతున్నా మంజూరు చేయడం లేదు. ఇసుక తిన్నెల్లోనే తాటాకు పాకలు వేసి వలలు, ఇంజన్లు భద్రపరుచుకోవాల్సి వస్తోంది. తుపానుల సమయంలో వీటిని కాపాడుకునేందుకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– చోడిపల్లి శ్రీను, మత్స్యకార నాయకుడు

తుపాను వస్తే రాత్రంతా కాపలా



వేటాడి తెచ్చిన సేపలు ఎండ బెట్టుకోడానికి చానా ఇబ్బంది పడతన్నం. ఇసక దిబ్బల్లోనే ఎండబెడతాం. వలలు, ఇంజిన్లయితే రేవులో పాకలు వేసుకుని దాసుకుంటం. తుపాను వస్తే రాత్రంతా అక్కడే కాపలా ఉండాల. కెరటాలు వచ్చి వలలు లాక్కుపోతాయనే భయం. పెబుత్వం మాకోసం అరుగులు, గదులు కడితే ఎంచక్కా అందులో పెట్టుకుంటాం.

అప్పలరాజు, రాజయ్యపేట

పాల సంఘ ఏకపక్ష నిర్ణయంపై ఆగ్రహం

మునగపాక: మండలంలోని మంగళవరపుపేట పాల సంఘం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించకపోవడం పట్ల ఆదివారం రైతులు ఆందోళనకు దిగారు. తమ అభిప్రాయాలు తీసుకోకుండా పాలకవర్గం ఏకపక్షంగా ఎలా నిర్ణయిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సంఘ ఆవరణలో నిర్వహించిన బేసిన్‌ల పంపిణీలో వివాదం చోటు చేసుకుంది. గత నెలలో సంఘ డైరెక్టర్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా దొంగచాటున మినిట్స్‌లో కొంతమంది పేర్లు పాలకవర్గ సభ్యులుగా రాసుకొని విశాఖ డెయిరీ అధికారులకు పంపడం సరికాదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమక్షంలో పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా సంఘ కార్యదర్శి ఏకపక్షంగా కార్యవర్గం ఎంపిక చేయడం తగదంటూ మండిపడ్డారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించి రైతులకు మేలు చేయాలని సంఘ మాజీ అధ్యక్షులు గనిరెడ్డి సూర్యనారాయణ, యల్లపు గోవింద, యల్లపు పద్మ, రాపేటి రామకృష్ణ, కొయిలాడ శంకరరావు, ఆడారి చిరంజీవి తదితరులు కోరుతున్నారు. లేకుంటే సొసైటీ ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు గుర్రాజుపేటలో గ్రామసభ

ఎస్.రాయవరం: గుడివాడ రెవెన్యూ గుర్రాజుపేటలో సోమవారం ఉదయం 10.30 గంటలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రమేష్ బాబు తెలిపారు. గ్రామసభకు ఏపీఐఐసీ ప్రత్యేక ఉప కలెక్టర్ హాజరవుతారన్నారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు కోసం గుడివాడ రెవెన్యూలో 172 ఎకరాల భూసేకరణ కోసం సంబంధించి రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రైతులు హాజరై తమ సందేహాలు చెప్పుకోవచ్చన్నారు.

రైతులకు బేసిన్లు పంపిణీ



రైతులకు బేసిన్లు అందజేస్తున్న పాల సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: విశాఖ డెయిరీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంగళవరపుపేట పాల సంఘ అధ్యక్షుడు మొల్లేటి సత్యనారాయణ కోరారు. మంగళవరపుపేటలో ఆయన ఆదివారం పాడి రైతులకు విశాఖ డెయిరీ ద్వారా సమకూర్చిన బేసిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ సేవలందిస్తుందన్నారు. రైతులు నాణ్యమైన పాలను సరఫరా చేయాలన్నారు. మేలు జాతి పశువులను కొనుగోలు చేయడం ద్వారా ఆదాయం సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, డైరెక్టర్లు యల్లపు రాము, ఆడారి వెంకటలక్ష్మి, భీశెట్టి సత్యనారాయణ, యల్లపు మహాలక్ష్మి, శరగడం శ్రీనివాసరావు, గనిరెడ్డి ఈశ్వరరావు, భీశెట్టి జోగినాయుడు, ధన శ్రీను, గొల్లవిల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టంలో అర్చకుడు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఘనంగా పసలమారమ్మ పండగ

అచ్యుతాపురం: మండలంలోని నునపర్తి గ్రామంలో పసలమారమ్మ పండగ ఆదివారం ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయం వద్ద సందడి వాతావరణం ఏర్పడింది. పలువురు అతిథులు, రాజకీయ ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పండగ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్లు సందర్శకులతో కిటకిటలాడాయి.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

పాయకరావుపేట: పట్టణంలో ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యా సంవత్సరంలో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అన్ని ధ్రువ పత్రాలతో ప్రభుత్వ ఐటీఐకు వచ్చి ఈ నెల 21వ తేదీలోగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోకుంటే వారి పేర్లు మెరిట్ లిస్టులో ఉండవన్నారు. ఎస్సెస్సీ, క్యాస్ట్, పాస్ ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ లింక్ ఫోన్ నంబర్, ఆధార్ కార్డుతో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు. కౌన్సెలింగ్ కోసం 7013737243, 9989478278 నంబర్లను సంప్రదించాలన్నారు.

చల్లగా చూడు తల్లీ..

వైభవంగా యానాద్రి అమ్మవారి జాతర



యానాద్రి అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: అమ్మా..యానాద్రమ్మా.. మాకే కష్టం రాకుండా చల్లగా చూడు తల్లీ.. అంటూ భక్తులు తమ మొక్కులు తీర్చుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం ఏటా యానాద్రి అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి పూజలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. మహిళలు అమ్మవారికి చీర, రవికెలు, నల్లపూసలు, గాజులు సమర్పించి పసుపుకుంకుమలతో పూజలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేసింది. సాయంత్రం నేలవేషాలు, కోలాట ప్రదర్శనలు, రాత్రి వరకూ ఉర్రూతలూగించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. బంధుమిత్రుల రాకతో అల్లూరి సీతారామరాజు కాలనీలో సందడి నెలకొంది. పట్టణ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా అమవారి ఆలయం, పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి



ఆర్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకన్న

కె.కోటపాడు : మండలంలో ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి ప్రాంతాల్లో వ్యవసాయ భూములను ఎస్ఈజెడ్‌ల కోసం రైతుల నుంచి బలవంతంగా తీసుకోవడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న అన్నారు. ఎస్ఈజెడ్‌లకు భూకేటాయింపుల కోసం రైతుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రహస్య సర్వేలను రెవెన్యూ అధికారులు చేస్తూ వారిని ఇబ్బందులు పెట్టే చర్యలు ఎంత మాత్రం సమంజసం కాదని ఆయన అన్నారు. బలవంతపు భూ సేకరణ నిలుపుదల చేయాలని కోరుతూ కె.కోటపాడు మండల తహసీల్దార్‌కు ఈ నెల 16న చెప్పుకుందాం.. కదిలిరండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ మూడు గ్రామాల్లో రైతులను ఆదివారం కలిసి కరపత్రాలను అందించి ప్రచారం చేశారు. ఉదయం 10 గంటలకు మూడు గ్రామాల్లోని రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు హాజరుకావాలని ఆయన కోరారు. అచ్యుతాపురం ప్రాంతాల్లో ఉన్న కంపెనీల వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయని, మరి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కంపెనీల వ్యర్థాలు ఎక్కడకు విడిచిపెడతారని అధికారులను వెంకన్న ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు, రొంగలి ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక




బేబీ భవిష్య

కోటవురట్ల: మండలంలోని తాళ్లపాలెంలో గాయత్రి హైస్కూలుకు చెందిన విద్యార్థిని కోన బేబీ భవిష్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 582 మార్కులు సాధించిన మేరకు రెండో విడత జాబితాలో ఎంపికైనట్లు పాఠశాల కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో ఆమెను పాఠశాల కమిటీతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

లయన్స్ క్లబ్ చోడవరం శాఖ కార్యవర్గం ఎన్నిక

చోడవరం: లయన్స్ క్లబ్ చోడవరం శాఖ నూతన కార్యవర్గం 2025-26 సంవత్సరానికి ఎన్నుకైంది. నూతన అధ్యక్షుడిగా పసుమర్తి సాంబశివరావు, కార్యదర్శిగా బద్దిమంత్రి పాల్గుణ, కోశాధికారిగా పనతల గంగాధర్ ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత అధ్యక్షుడు నీలం నాగేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ అధికారి గోపాలరావు హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే రాజు, తదితర్లు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. జీఎంటీ కో-ఆర్డినేటర్ పుసర్ల సుధీర్, రీజనల్ చైర్‌పర్సన్ చెరుకూరి ఇందిర, జోన్ చైర్మన్ ఉప్పల వెంకటరాజు.. క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయించారు.

పారిశుధ్య కార్మికుడికి సన్మానం



పారిశుధ్య కార్మికుడు బండి ఆనంద్, బర్రమ్మ దంపతులను సత్కరిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: జీవీఎంసీ పారిశుధ్య కార్మికునిగా సేవలందిస్తూ పట్టణంలో అనేక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న బండి ఆనంద్ అభినందనీయుడని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. బండి ఆనంద్ పదవీ విరమణ సందర్భంగా పట్టణంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆనంద్, బర్రమ్మ దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో పారిశుధ్య పనులను చేయడం అందరికి సాధ్యం కాదన్నారు. కాబట్టి వారిని సమాజం మరింత గౌరవించాలన్నారు. పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ శ్రీను పాల్గొన్నారు.

గోరింటాకు విశిష్టతపై అవగాహన



గోరింటాకు పెట్టుకున్న వికలాంగ చిన్నారులతో ఫౌండేషన్ ప్రతినిధులు

పరవాడ: గోరింటాకు పెట్టుకోవడం ద్వారా కొన్ని అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం మండల కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి తెలిపారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఫౌండేషన్ ప్రతినిధులు అచ్యుతాపురం వికలాంగుల ఆశ్రమంలో గోరింటాకు విశిష్టతపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. పిల్లలకు గోరింటాకు పెట్టడడం వలన వైరస్, క్రిమికీటకాలు దరి చేరవన్నారు. భాగంగా గోరింటాకు విశిష్టతపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలందరి చేతులకు గోరింటాకు పెట్టి వారితో మాటామంతీ కలిపారు. వికలాంగుల పాఠశాల కరస్పాండెంట్ పి.ఎస్.టి.పట్నాయక్, ఇన్‌చార్జి హెచ్ఎం పాలిపిల్లి శ్రీను, ఫౌండేషన్ ప్రతినిధులు బొద్దపు సూకరత్నం, పూర్ణ, కింతాడ వరలక్ష్మి పాల్గొన్నారు.